# అమ్మకావాలి



**వి. రాఘవేంద్రరావు**

**"ఛీ ఛీ పాడు సంత. రాత్రంతా ఒకే గోల. నిద్రపోనివ్వకుండా ఓకటే ఏడుపు" అన్నాను విసుక్కుంటూ. నేనేం మాట్లాడుతున్నానో మా ఆవిడకి అర్థం అయినట్టు లేదు. మొహాన్ని ప్రశ్నార్థకం చేసి, "ఏమిటండీ! ఇప్పుడెవరేమన్నా రని?" అంటూ సాగదీసింది. "నీ సంగతి కాదులే" అన్నాను. ఆవిడ చేతిలో వున్న కాఫీ కప్పు అందుకుంటూ. తెల్లవారగానే నేను చిర్రుబుర్రుమనటం మా ఆవిడకి ఏమాత్రం రుచించదు.**

"మీరేమంటున్నారో నాకు తెలీదు. పొద్దున్నే ఎవరి మీద ఈ ధ్వజం ఎత్తారో చెప్పండి" అని నా ప్రక్కనే సోఫాలో కూచున్నది. పక్కింట్లో ఓ కుటుంబం వున్నది. ఇద్దరు ముసలాళ్ళు. వాళ్ళతో ఓ పిల్ల కొత్తగా వచ్చి అద్దెకు పక్కింటి వాటాలో దిగారు. నా బెడ్‌రూమ్ కిటికీలోంచి చూస్తే వాళ్ళ బెడ్‌రూమ్ కనిపిస్తుంది. అందుకే నేను కిటికీ తలుపులు సాధారణంగా మూసే వుంచుతాను. ఒకళ్ళ బెడ్‌రూమ్‌లోకి ఒకళ్ళు తొంగి చూడటం అంటే నాకు గిట్టదు. నేను రాత్రి పొద్దుపోయేదాకా లైటార్పకుండా చదువుతూ వుంటానని అలిగి ఇటీవల మా ఆవిడ తన పడకని వంటింట్లోకి మార్చేసింది. అరణ్యంలో తలపెట్టుకుని, నగరంలో కాలం వెళ్ళబుచ్చాల్సిన వానప్రస్థంలో కాలుపెట్టాం ఇద్దరం. కాబట్టి, కంపల్సరీగా కలిసి ఒకే మంచాన నేనూ, మా ఆవిడ పడుకోవలసిన అవసరమూ అంతగా కనిపించలేదు. బుద్ధి పుడితే తనే వచ్చి పక్కన చేరుతుందిలెమ్మని నేనూ మెదలకుండా వుండిపోయాను.

అసలు విషయం ఏమిటంటే, పక్కింటి వాటాలో మాలాంటి వృద్ధ దంపతులె కాపురం పెట్టినా, వాళ్ళతోపాటు తెచ్చుకున్న ఆ పిల్ల మా మధ్య వుండవలసిన సఖ్యతకి గండికొట్టింది. వాళ్ళ ఒక్కగొనొక్క కొడుకు, కోడలు డాలర్లు ఆర్జించటానికి అమెరికా వెళ్ళిపోయారు. ముసలాళ్ళని వదిలి వెళ్ళటమే కాదు, వాళ్ళ మెడకి తమ కూతుర్ని డోలులా కట్టి మరీ పోయారు. ఆ నానమ్మకి ఈ పిల్ల బాగా మచ్చిక అయిన మాట ఎంతవరకు నిజమో తెలీదు. రాత్రిళ్ళు లేచి అమ్మకావాలి అంటూ ఏడుపు లంఘించుకుంటున్నది. వాళ్ళు మనుమరాలి ఏడ్పుకు ఏమాత్రం పట్టించుకోటం లేదు. బహుశా, అది వాళ్ళకి బాగా అలవాటైపోయినట్టున్నది. నాకు మాత్రం ఆ పిల్ల ఏడ్పు మొదలెట్టగానే, నిద్ర కాస్త హుష్‌కాకి అయి కూచుంటున్నది. అలా కాస్సేపు ఏడ్చి ఏడ్చి ఆ పిల్ల నిద్రపోతుంది. నాకు ఆ తర్వాత శతవిధాలా ప్రయత్నించినా కంటిపైన రెప్ప పడటం లేదు. వాళ్ళు పక్కన చేరిన పక్షం రోజులకే నా కళ్ళు బెలూన్లలా ఉబ్బిపోయాయి. నిద్రలేమి వల్ల తల గిర్రున తిరిగితే, ఎక్కడ పడిపోతానోనని నా భయం. పడ్డాక ఏ కాలో చెయ్యో విరిగిందనుకోండి అంతే సంగతులు. నేను ఏకరువుపెట్టింది శాంతంగా విని ఓ నిట్టూర్పు వదిలింది మా ఆవిడ. నా నుంచి దూరమై వంటింట్లో వంటరిగా పడుకోవడం అప్పుడే బోర్ కొట్టేసిందేమో. ఓ ఉచిత సలహా పారేసి రంగం నుంచి నిష్క్రమించింది.

"ఈ రాత్రి నుంచి మీరూ వంటింట్లో వచ్చి పడుకోండి. ఎవరు ఏడ్చిమొత్తుకున్నా మీకేం వినిపించదు" ఈ బోడి సలహా నాకు తెలియదనుకున్నది పాపం. పిచ్చిది మా ఆవిడ. మనిషి అలవాట్లకు బానిస. ఎటు తిరిగినా ప్రతి జీవి చీకటి పడేసరికి, పక్షిగూడు చేరుకున్నట్టు. ఇల్లు వెతుక్కుంటూ రాక తప్పదు. సాయంత్రం అయ్యేసరికి ట్రాఫిక్ జామ్ అవటానికి కా త్వరగా గూడు చేరుకోవాలన్న తపన. ఇంటికి రాగానే సరాసరి నా బెడ్‌రూమ్ మాత్రమే నాకు కనిపిస్తుంది. అందులో పడుకుంటేనే నాకు ఆనందం. చోటు మారిస్తే నిద్ర పట్టదు.

❊ ❊ ❊

ఆ రోజు రాత్రి భోరున వర్షం కురుస్తున్నది. చీకటి పడగానే ముసురుపట్టి చినుకులు పడటం మొదలయ్యింది. అప్పుడే అనుకున్నాను ఏ అర్ధ రాత్రికో అది ఉధృతం కాక మానదని. ఒక వైపున భోరున వర్షం పడుతుంటే, ఆ శబ్దాన్ని అధిగమించి, ఓ కుక్కపిల్ల ప్రక్క సందులో నుంచి అరవటం వినిపిస్తున్నది. పిల్ల ఏడుపుకు బదులు కుక్కపిల్ల అరుపు (ఏడుపులాంటిదే) వినిపించేసరికి నాకేదో కొత్త బాణీలో బాకా విన్నంత సంబరం కలిగింది. నిద్ర ఎలాగూ పట్టదు. కనీసం ఆ ఏడుపును వింటూ కాలక్షేపం చేయాలనుకున్నాను. నా అభిరుచికి అనుగుణంగా ఆ కుక్కపిల్ల రకరకాల

బాణీలతో ఏడ్పులాంటి అరుపులతో కలిగిస్తోంది. సందు వైపున్న కాంపౌండు గోడ, ఆలమట్టి డామ్‌లా ఎత్తు పెంచేయాలని నిన్ననే ఓ లారీ ఇసుక పోయించాను సందులో. కుక్కపిల్ల ఏడుపు కచ్చేరి అన్నదే మొదలయ్యిందన్నమాట.

కానీ అది అలా నాన్‌స్టాప్‌గా అరుస్తూ వుంటే, వెళ్ళి ఓసారి చూడాలనిపించింది నాకు. దాని అరుపు ఓ దీనాలాపనలా వినిపిస్తున్నది ఇప్పుడు. నాకు సంగీత జ్ఞానం సున్న. అంచేత ఆ కుక్కపిల్ల ఏ రాగంలో ఏడుస్తున్నదో చెప్పలేను కానీ, అది మాత్రం నన్ను బెడ్‌రూమ్ నుంచి బయటకు నడిపించింది.

ఓ చేత్తో గొడుగు పట్టుకుని, మరో చేత్తో టార్చి లైటు ధరించి బయలుదేరాను. నేను అనుకున్నట్టుగానే, ఆ కుక్కపిల్ల ఇసుక కుప్ప మీద తల దాచుకోటానికి వృథాగా ప్రయత్నిస్తూ, అలా వానలో తడిచి ముద్దయిపోయి దిక్కు తోచక ఏడుస్తున్నది. వర్షంలో తడవటంవల్ల గజగజా వణికిపోతున్నది. నేను టార్చి వెలుగులో దాన్ని సమీపించటానికి ప్రయత్నిస్తూ వుండగా, అది మరింత భయంగా కుంచించుకుపోవటం మొదలెట్టింది. అది చూడగానే నా మనస్సు ఆర్ద్రమైపోయింది. దాని తల్లి ఎటు పోయిందో ఏమో! బహుశా, ఈ కుక్కపిల్లే దారి తప్పి ఇలా వచ్చి ఈ వానలో, ఈ ఇసుకలో కూరుకుపోయిందేమో. అది అరుస్తూనే ఉన్నది. నేను చూస్తూనే వున్నాను. దాని అవస్థ చూశాక ఒంటరిగా తిరిగి వెళ్ళి పోవటానికి నా మనస్సు ఒప్పుకోలేదు. ఆకులా రెపరెపలాడి పోతున్న ఆ కుక్కపిల్లని నాతోపాటు తీసుకు వచ్చేశాను. మా ఆవిడ ఒంటిమీద స్పృహ లేకుండా వంటింట్లో గుర్రుపెట్టి నిద్రపోతున్నది. ఓ గోనెసంచి తెచ్చి కుక్కపిల్లని పడుకోబెట్టాను వరండాలో. ఓ గుడ్డ తీసుకొని దాని ఒళ్ళు శుభ్రంగా తుడిచి, కాస్త పాలు వెచ్చచేసి నోటికందించాను. బెరుకుగా చూస్తూనే, మెల్లగా వచ్చి గిన్నెలోని పాలు మెల్లగా ఆరగించింది. కాస్త ఒణుకు తగ్గింది కుక్కపిల్లకి. ఇదివరకటిలా నా చెయ్యి తగలగానే అది బెదిరిపోవటం లేదు.

వర్షం కాస్త తగ్గుముఖం పట్టింది. తెల్లారాక చూసుకోవచ్చులేనని, మరో సంచి తెచ్చి కుక్కపిల్ల మీద కప్పాను. దాని మెడకు ఓ తాడుకట్టి కిటికీకి బిగించాను. ఇక మెల్లగా అదే సర్దుకుంటుందిలే అనుకుని తలుపు మూసి లైటార్పేశాను. పక్కమీద వాలి పది నిముషాలైనా అవలేదు. కుక్కపిల్ల మళ్ళీ కచ్చేరి ప్రారంభించేసింది. దీనికితోడు పక్కింటి పిల్ల కూడా నిద్ర లేచి ఏడుపు లంకించుకున్నది. ఈ రాత్రి ఎలాగూ శిరాత్రే. అన్ని సేవలు చేసినా ఈ కుక్కముండ ఏడవడం దేనికో నాకు అర్థం కాలేదు. నేను వరండాలో లైటు వెలిగించగానే నన్ను ఓ నిముషం చూసి మళ్ళీ కుయ్‌కుయ్‌మని ఏడవటం ప్రారంభించింది. బహుశా కడుపుకు ఆహారం చాలలేదేమోననుకుని మరిన్ని పాలు పట్టుకు వచ్చి దాని ముందు పెట్టాను. ముట్టుకోలేదు. వాసన చూసి వదిలేసింది. అంటే ఇది పాలకోసం ఏడవటం లేదన్నమాట. వెధవముండ ఓ రెండిస్తే నోరు మూస్తుందేమో. అలా అనుకుంటూ చెయ్యెత్తి అదిలించబోయాను. అది ముడుచుకుపోవటం తప్ప ఏడవటం మాత్రం మానలేదు.

కుక్క బుద్ధి ఎక్కడికి పోతుంది? కుక్క తోక వంకర అని ఊరికే ఎందుకంటారు. వర్షం తగ్గింది. మళ్ళీ వీధిలో పారేస్తే అదే చక్కాపోతుంది. ఓ గంట క్రితం దాని పరిస్థితి చూసి ఆర్ద్రత చెందిన నా హృదయం ఈ క్షణం ఇలా శాశిస్తున్నదేమిటి? "దాని నిలకడ నీటిబుడగా - మనుగడ గాలి పడగా" మనిషి మనసు మారటానికి ఎంతసేపు కావాలి? విశ్వాసం కుక్క సొత్తుగాని, మనిషికి ఆట్టే విశ్వాసంతో పొత్తు కుదరదుగా.

దాని మెడకి కట్టిన తాడు విప్పి జరజరా వీధిలోకి ఈడ్చుకు వచ్చాను. కాంపౌండు గేటు తీయగానే ఓ ఆడకుక్క నల్లగా దెయ్యంలా ప్రత్యక్షమైంది. నాలుక వెళ్ళబెట్టి వగురుస్తూ నన్నే చూస్తూ నిలబడి వున్నది. ఓ నిముషం తికమకపడ్డా. నాకు విషయం బోధపడింది.

అది ఈ కుక్కపిల్ల తల్లి అని తప్పిపోయిన తన కూన కోసం వెతుకుతూనే వున్నదని, పిల్ల ఏడుపు విని గేటు ముందు కాపలా కాస్తున్నదని నేను వివరణ ఇవ్వవలసిన పని లేదనుకుంటాను. చేతిలో వున్న తాడు కింద పడవేయగానే కుక్కపిల్ల కుయ్‌కుయ్‌మంటూ పరుగెత్తుకుపోయి తల్లి పక్కన చేరింది. ఎలా గుర్తుపట్టిందో అది ముద్దులు కురిపిస్తూ వుంటే నల్లకుక్క దాని ఒళ్ళు నాకి, నా వైపు ఓసారి కృతజ్ఞతగా చూసి ముందుకు సాగింది. దాని పక్కనే మెల్లగా గెంతుకుంటూ కుక్కపిల్ల కూడా వెళ్ళిపోయింది.

పక్కింటి పిల్ల రాత్రిళ్ళు లేచి ఎందుకు ఏడుస్తుందో నాకు ఇప్పుడు అర్థం అయింది. అమ్మ కావాలి. ఏ పిల్లకైనా కావలసింది తల్లి ప్రేమ. అమ్మ లేకపోతే ఏ ప్రాణి అయినా అలా ఏడుస్తూనే వుంటుంది. అమ్మ విలువ పోగొట్టుకున్నప్పుడు కాని తెలిసి రాదు. నేనూ అమ్మను పోగొట్టుకున్నాను. మా అమ్మ తలపుకు రాగానే అమ్మ కావాలి అని నా మనస్సు ఏడ్పు మొదలెట్టింది. కానీ ఎలుగెత్తి ఏడ్వటానికి నేను పిల్లా కాను, కుక్కపిల్లా కాలేను. అదే నా బాధ. ❋

## మధుర స్మృతులు



### గాంధీజీ చూసిన సినిమా రామరాజ్య

**త**న జీవితంలో గాంధీజీ మొట్టమొదటి సారిగా చూసిన సినిమా రామరాజ్య. ఆ చిత్రం చూసి చాలా అభినందించారు.


సీత భూమిలోకి వెళ్ళే సన్నివేశాన్ని చూసి చాలామంది కన్నీరు కార్చారు.

రామరాజ్య చిత్ర హక్కులు ఎవర్ గ్రీన్స్ అనే నిర్మాణ సంస్థకు చెందినది. ఆ సంస్థను ఏ.వి.యం. నిర్మాత కలుసుకొని తమిళంలో డబ్ చేయటానికి హక్కులు అడిగారు.

రాముడు పట్టాభిషేకంతో ఈ చిత్రం ప్రారంభమవుతుంది.

ఈ చిత్రంలో ప్రేమ్ అధీప్ రాముడుగాను, శోభన సామ్రాట్ (నటి నూతన్ తల్లి) సీతగాను బ్రహ్మాండంగా నటించారు.

తమిళంలో రామరాజ్యం పేరిట ఈ చిత్రం విడుదలై విజయఢంకా మ్రోగించింది. మలయాళంలో కూడా ఈ చిత్రం విడుదల చేశారు. అక్కడ కూడా ఈ చిత్రం గొప్ప విజయం సాధించింది. **- పిళ్ళారిసెట్టి ఆదికేశవరావు**



***ఆం**ధ్రకేసరి ప్రకాశం పంతులు 134వ జయంతి సందర్భంగా, ఇటీవల చెన్నై ఎస్‌ప్లనేడ్‌లోని ఆయన శిలా విగ్రహానికి పూమాలను సమర్పిస్తున్న శ్రీయుతులు రుక్మిణీదేవి. కె. లాజర్, పేరిశెట్ల భాస్కరుడు, గుడిమెట్ల చెన్నయ్య, డి. నాగరాజు, మందల కృష్ణయ్య, టి. కిరణ్‌బాబు*